క్లుప్తంగా

శభాష్.. సీఐ గిరీష్



సిద్దేశ్వర గుప్తాను ఆస్పత్రికి తీసుకెళ్తున్న దృశ్యం

మడకశిర రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తిని తన వాహనంలో ఆస్పత్రికి తీసుకెళ్లి మానవత్వం చాటుకున్నారు పావగడ రూరల్ సీఐ గిరీష్. వివరాలు.. హరేసముద్రం నుంచి సిద్దేశ్వర గుప్తా ద్విచక్ర వాహనంలో మడకశిరకు వస్తుండగా.. హైవే రోడ్డు దాటుతున్న క్రమంలో అటు వైపు నుంచి వస్తున్న ఐచర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో సిద్దేశ్వర గుప్తా తీవ్రంగా గాయపడ్డాడు. మధుగిరి వైపు వెళ్తున్న పావగడ రూరల్ సీఐ గిరీష్ గమనించారు. వెంటనే తన వాహనంలో గాయపడిన వ్యక్తిని ఎక్కించుకుని మడకశిర ఆస్పత్రికి తరలించారు. సకాలంలో వైద్య చికిత్సలు చేయించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. గాయపడిన వ్యక్తికి వైద్య చికిత్స చేయించిన సీఐ గిరీష్‌ను పట్టణ ప్రజలు అభినందించారు.

ఏపీఎస్‌టీఏ జిల్లా కార్యవర్గంలో చోటు



ప్రదీప్ కుమార్



కరిబడప్ప

అమరాపురం: ఏపీఎస్‌టీఏ జిల్లా కార్యవర్గంలో అమరాపురం మండలానికి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు చోటుదక్కించుకున్నారు. నిద్రగట్ట ప్రాథమికోన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ప్రదీప్ కుమార్ జిల్లా కోశాధికారిగా, వి.అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కరిబడప్ప ఆడిట్ కన్వీనర్‌గా ఎన్నికయ్యారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలల మనుగడను ప్రశ్నార్థకం చేసిన జీఓ 117 రద్దు, పాత పెన్షన్ పునరుద్ధరణకు పోరాడతామన్నారు. జిల్లా కార్యవర్గంలో స్థానం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు కాడిశెట్టి శ్రీనివాసులుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కార్యవర్గంలో చోటు దక్కడంతో మండలంలోని ఏపీఎస్‌టీఏ సంఘం ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

జపానంద సేవలు అభినందనీయం



క్రీడా మైదానాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పావగడ: స్వామి జపానంద సామాజిక సేవలు అభినందనీయమని స్థానిక ఎమ్మెల్యే వెంకటేశ్ కొనియాడారు. కేవలం ఆరోగ్య సేవలే కాకుండా ఆధ్యాత్మిక, విద్య, సామాజిక సేవలు సైతం క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న తీరు ప్రశంసనీయమన్నారు. స్థానిక స్వామి వివేకానంద గ్రామీణ సంఘటిత ఆస్పత్రిలో శనివారం నూతన శౌచాలయాన్ని ఎమ్మెల్యే వెంకటేశ్ ప్రారంభించారు. అదే విధంగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్మించిన పావనగంగ రక్షిత తాగునీటి కేంద్రం, క్రీడా మైదానాన్ని స్వామి జపానంద, ఎమ్మెల్యే వెంకటేశ్ ప్రారంభించారు. అలాగే ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజేశ్, సుదేశ్ బాబు, శంకర రెడ్డి, బత్తినేని నాని, ప్రిన్సిపాల్ శివానంద తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

మడకశిర: పట్టణంలోని ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ.. విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. న్యాయవాదులు ఉమేష్ చంద్ర, గోపీనాథ్, నాగరాజు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కేటీహళ్లి అధ్యక్షుడిగా నరసింహమూర్తి



నరసింహమూర్తిని సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకాలోని కేటీహళ్లి పంచాయతీ అధ్యక్షుడిగా నరసింహ మూర్తి గెలుపొందారు. శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో జేడీఎస్ మద్దతుదారుడు నరసింహమూర్తి, కాంగ్రెస్ మద్దతుదారుడు మంజునాథ్ నామినేషన్ దాఖలు చేశారు. గ్రామ పంచాయతీలో 16 మంది సభ్యులుండగా నరసింహ మూర్తికి 12 ఓట్లు, మంజునాథ్‌కు 3 ఓట్లు పోలయ్యాయి. ఒక సభ్యుడు గైర్హాజరయ్యాడు. దీంతో 9 ఓట్ల మెజారిటీతో జేడీఎస్ అభ్యర్థి నరసింహ మూర్తి విజయం సాధించాడు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిని మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, జేడీఎస్ నాయకులు తిమ్మారెడ్డి, ఎస్పీ ఈరణ్ణ, లోకేశ్ పాళేగార్ తదితర పార్టీ నాయకులు అభినందించారు.

పట్టు.. లాభాలకు మెట్టు

- వంద శాతం దాటుతున్న దిగుబడులు
- సీబీ (పసుపు) రకానికి మార్కెట్లో విపరీతమైన గిరాకీ
- 34 రోజుల్లో రెండు పంటలు తీస్తున్న రైతన్నలు
- రూ.లక్షకు తగ్గని నెలాదాయం..



సాగు చేసిన రేషం పంట



పట్టు పురుగులకు ఆకు వేస్తున్న రైతు

పెనుకొండ: పట్టు లాభాలకు మెట్టుగా నిలుస్తోంది. సీబీ రకం పట్టు గూళ్ల పంటకు మంచి ధరలు వస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సీబీ (పసుపు) రకానికి మార్కెట్లో విపరీతమైన గిరాకీ ఉంటోంది. నిలకడగా ధరలు ఉండడంతో పాటు వందశాతం దిగుబడి ఉంటుండడంతో రైతులు 34 రోజుల్లో రెండు పంటలు తీస్తూ రూ.లక్షకు పైనే సంపాదిస్తున్నారు. రొద్దం మండలం బీదానిపల్లి, మహదేవపల్లి, చాలకూరు, పెదకోడిపల్లి, మావటూరు తదితర గ్రామాలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. బీదానిపల్లి నుంచి రోజూ రైతులు పట్టు గూళ్లను కర్ణాటకలోని శిడ్లఘట్టకు తీసుకెళ్తున్నారు. గ్రామంలో ఎక్కడ చూసినా మల్బరీ, మల్బరీ షెడ్లు కనిపిస్తాయి. ఒకప్పుడు బైవోల్టిన్ (వైట్) పట్టుగూళ్ల ఉత్పత్తిలో కొండాపురం గ్రామం ఆదర్శంగా ఉండేది. ప్రస్తుతం కరోనా సమయంలో మార్కెట్ లేకపోవడంతో పట్టుసాగును తగ్గించి, పాడిపై ఆధారపడ్డారు. కొందరు కియా కార్ల పరిశ్రమలో ఉద్యోగాలు సాధించి, ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుతం మళ్లీ పట్టు సాగుపై ఆసక్తి చూపుతూ మంచి ఆదాయం పొందుతున్నారు.

పెనుకొండ నియోజకవర్గంలో పట్టు సాగు విస్తీర్ణం ఇలా..

మండలం	ఎకరాలు
పెనుకొండ	750
రొద్దం	2,500
సోమందేపల్లి	2,400
పరిగి	1,800
గోరంట్ల	600

వంద శాతం దిగుబడి



రెండు ఎకరాల్లో రెండు లాట్‌లు పెట్టుకున్నా. ప్రతి లాట్ 17 రోజులకు పూర్తవుతుంది. కర్ణాటక రాష్ట్రం శిడ్లఘట్ట నుంచి పురుగులు తీసుకొచ్చి మేపుతున్నాం. వంద పురుగులకు 120 కేజీల పైనే దిగుబడి వస్తోంది. ప్రతి లాట్ రూ.500 నుంచి రూ. 680 వరకు పలుకుతోంది. వాతావరణం మారితే రూ. 800 ధర పలికే అవకాశం ఉంది.

కురుబ రామాంజనేయులు,
పట్టు రైతు, మహదేవపల్లి, పెనుకొండ మండలం

వెంట వెంటనే పంట తీస్తున్నాం



నూతన విధానాలతో మల్బరీ పట్టు గూళ్లను మేపుతున్నాం. గిట్టు బాటు ధరలు లభిస్తున్నాయి. జనవరి నుంచి కిలో రూ. 800 దాటే అవకాశం ఉంది. క్రమం తప్పకుండా 17 రోజులకు ఒక పంట పూర్తి చేస్తున్నాం. అనంతరం షెడ్డు శుభ్రం చేయడమే తరువాయి. మళ్లీ పట్టు గుడ్లను మేపడానికి సిద్ధం అవుతాం. కర్ణాటక రాష్ట్రం శిడ్లఘట్టలో సీబీకి మార్కెట్ బాగుంది.

– కురుబ నగేష్, మహదేవపల్లి, పెనుకొండ మండలం

సహకారం అందిస్తాం

మల్బరీ సాగు చేస్తున్న ప్రతి రైతుకూ సహకారం అందిస్తాం. సబ్సిడీతో రేషం షెడ్లు కావాలంటే కార్యాలయంలో సంప్రదించొచ్చు. ఇతర సబ్సిడీలకు సైతం కార్యాలయంలో సంప్రదించాలి. రైతులు మరింత దృష్టి సారించి మల్బరీ సాగుకు ముందుకు రావాలి. కరోనా సమయంలో మార్కెటింగ్ సౌకర్యం లేక దెబ్బ తిన్న మల్బరీ రైతులు మళ్లీ పంట సాగుపై దృష్టి సారించలేదు. ఆ పరిస్థితిని రైతులు అధిగమించాలి. మల్బరీ రైతుకు నిరంతరం అండగా ఉంటాం. గ్రామాల్లో దీనిపై రైతుల్లో అవగాహన కల్పిస్తున్నాం.

– రత్నం, పట్టు పరిశ్రమ శాఖ ఏడీ, పెనుకొండ

మెరుగైన వైద్య సేవలు అందించాలి



రికార్డులను తనిఖీ చేస్తున్న నేషనల్ హెల్త్‌మిషన్ ప్రోగ్రాం జిల్లా అధికారి నాగరాజు

అగళి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని శనివారం నేషనల్ హెల్త్‌మిషన్ ప్రోగ్రాం జిల్లా అధికారి నాగరాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పులు చేయించుకునేలా గర్భిణులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ శివానంద, సూపర్‌వైజర్ నర్సారెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

హిందువులపై అరాచకాలు ఆపాలి

హిందూపురం: బంగాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అరాచకాలను, దాడులను వ్యతిరేకిస్తూ హిందూ సంఘాల ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో చిన్నమార్కెట్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకూ శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. ఇస్కాన్ బెంగళూరు హరే కృష్ణ మూవ్మెంట్ భక్తవృందగదాస ప్రభు స్వామిజీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బంగ్లాదేశ్‌లో మైనారిటీ హిందువుల రక్షణ కోసం నిరంతరం శ్రమిస్తున్న సనాతన ధర్మ ప్రచారకులు చిన్మయ కృష్ణ ప్రభువును అన్యాయంగా అక్కడి ప్రభుత్వం దేశద్రోహం కేసులో అరెస్టు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో హిందూసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ బాధితులకు సంఘీభావం



హిందూపురంలో ర్యాలీ చేస్తున్న ఐసీటీసీ జిల్లా ఆస్పత్రి సిబ్బంది



కొవ్వొత్తులతో సంఘీభావం తెలుపుతున్న డిగ్రీ కళాశాల విద్యార్థినులు

హిందూపురం/హిందూపురం టౌన్: హెచ్‌ఐవీతో మృతిచెందిన వారి ఆత్మశాంతి చేకూరాలని ఐసీటీసీ జిల్లా ఆసుపత్రి విభాగం ఆధ్వర్యంలో క్యాండిల్స్ ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఐవీతో జీవిస్తున్న వారికి సంఘీభావం తెలుపుతూ జిల్లా ప్రభుత్వాస్పత్రి, చైతన్య స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా జిల్లా ఆస్పత్రి నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకూ కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో చైతన్య సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ తిప్పేస్వామి, ఐసీటీసీ డీఎస్ఆర్‌సీ కౌన్సిలర్లు బాబు,మారుతీ ప్రసాద్, విమలా కుమారి, సిబ్బంది పూర్ణిమ, సరిత, తదితరులు పాల్గొన్నారు. అలాగే హెచ్‌ఐవీ బాధితులకు సంఘీభావం తెలుపుతూ పట్టణంలోని ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు శనివారం సాయంత్రం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, రెడ్ రిబ్బన్ క్లబ్, చైతన్య స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వెంకటేశులు, అధ్యాపకులు యశోదా దేవి, శ్రీధర్, సరస్వతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రంగనాయకులు, రెడ్ రిబ్బన్ క్లబ్ ఇన్‌చార్జ్ అమరేష్, చైతన్య స్వచ్ఛంద సంస్థ మేనేజర్ తిప్పేస్వామి, ఐసీటీసీ కౌన్సిలర్ బాబు, డీఎస్ఆర్‌సీ కౌన్సిలర్ మారుతీ ప్రసాద్, చైతన్య సంస్థ ఎంఈఏ నవీన్ కుమార్, ఏఎస్ఎం సుజన, శిల్ప, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పుష్కరిణిలో గంగహారతి

మడకశిర రూరల్: మండల పరిధిలోని నీలకంఠాపురం గ్రామంలో ఉన్న నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో కార్తీక అమావాస్య సందర్భంగా ఆదివారం సాయంత్రం పుష్కరిణిలో గంగహారతి, శివపూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

సంక్షిప్త సమాచారం

2న పరిగిలో ఓపెన్ ఫోరం

పరిగి: ఉపాధి హామీ పనులపై చేపట్టిన తనిఖీపై ఈనెల 2న ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అధికారులు, ఉపాధికూలీలు హాజరు కావాలన్నారు.

జిల్లా ఉపాధ్యక్షుడిగా కిష్టప్ప

సోమందేపల్లి: ఏపీ ఎస్‌టీఏ జిల్లా ఉపాధ్యక్షుడిగా కె.కిష్టప్పను ఎంపిక చేస్తూ రాష్ట్ర అధ్యక్షుడు కాడిశెట్టి శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. కిష్టప్ప మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వం జీఓ 117 రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

అమరాపురం: స్థానిక ప్రాథమిక పాఠశాల మెయిన్‌లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆరోగ్య మైత్రి కూటమి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కూటమి సభ్యులు డాక్టర్ బసవరాజు, పద్మరాజ్ జైన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరానికి కర్ణాటక రాష్ట్రం నుంచి వైద్యులు జ్యోతి విజయ్ కుమార్, సామాన్య వ్యాధి నిపుణులు ఓంకార్ నాయక్ హాజరవుతారన్నారు.

హంతకులను కఠినంగా శిక్షించాలి

మడకశిర: విద్యార్థి చేతన్ కుమార్‌ను హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం చేతన్ కుమార్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి కొవ్వొత్తులతో బాలుడికి నివాళులర్పించారు. సీపీఐ కార్యదర్శి పవిత్ర, బాలికల హాస్టల్ వార్డెన్ సునీత, సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన

చిలమత్తూరు: మండలంలోని టేకులోడు ఎస్సీ కాలనీలో పౌరహక్కులపై రెవెన్యూ సిబ్బంది, పోలీసులు అవగాహన కల్పించారు. శనివారం డిప్యూటీ తహసీల్దార్ బి. జగన్నాథ్ , ఎస్ఐ మునీర్ అహ్మద్ మాట్లాడుతూ సమాజంలో అందరూ సమానమే అన్నారు. ప్రతిఒక్కరూ హక్కులు, భాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం సంక్షేమ పథకాల గురించి వివరించారు. వీఆర్ఓ అశ్వర్థనారాయణ, ప్రజలు పాల్గొన్నారు.

ఎంఈఓకు సన్మానం

పరిగి(రొద్దం): రొద్దం మండల విద్యాధికారి అంజనేయులు నాయక్‌ను ఉపాధ్యాయులు శనివారం సన్మానించారు. రొద్దం మండలంలో ఎంఈఓ అంజనేయులు నాయక్ చేసిన సేవలను గుర్తించి, ప్రభుత్వం ఇటీవలే ఉత్తమ ఎంఈఓగా అవార్డును అందించింది. మండల కేంద్రంలో పలువురు ఉపాధ్యాయులు ఎంఈఓను సన్మానించి, ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మారుతీ, తేజ, రమేష్, గోకుల్, శ్రీనివాసులు, విద్యాజ్యోతి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం

చిలమత్తూరు(లేపాక్షి): ఉపాధ్యాయురాలు రాజేశ్వరి సేవలు మరువలేనివని ఎంఈఓ నాగరాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయురాలు రాజేశ్వరి పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 కుళ్లాయప్ప, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌కు వీడ్కోలు

గుడిబండ: మండలంలోని ఎంజేపీ బాలికల జూనియర్ కళాశాలలో గత ఏడేళ్లుగా పని చేసిన ప్రిన్సిపాల్ జ్యోతి ఇటీవల పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరుకు బదిలీ అయ్యారు. శనివారం ఆమెకు కళాశాలలో వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది ప్రిన్సిపాల్ జ్యోతికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. వక్తలు మాట్లాడుతూ.. ఉద్యోగి జీవితంలో బదిలీ తప్పనిసరి అన్నారు. ఎంజేపీ కళాశాలలో సమస్యలు తలెత్తకుండా విధులు నిర్వహించి విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించారని ప్రిన్సిపాల్ వరప్రసాద్ తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ అధికారుల వేధింపులు ఆపాలి

పెనుకొండ: పెనుకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ వర్కర్లపై వేధింపులు ఆపాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ తెలిపారు. శనివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టు పరిధిలోని పెనుకొండ, రొద్దం మండలాల్లో అంగన్‌వాడీ వర్కర్లను ఐసీడీఎస్ అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి బావమ్మ, సెక్టార్ లీడర్లు సావిత్రమ్మ, లక్ష్మిదేవి, పద్మ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ

పెనుకొండ: పట్టణ సమీపంలోని త్రిపురా రిసార్ట్‌లో యజమాని గోపీనాథ్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పడి పూజ శనివారం రాత్రి నిర్వహించారు. వందలాది మంది అయ్యప్ప మాలధారులు పూజలో పాల్గొని, స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



రొద్దం మండల నాయకులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

పరిగి: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి, పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ తెలిపారు. శనివారం పరిగి, రొద్దం మండల పర్యటనలో భాగంగా ఆమె పరిగి మండలంలోని జంగాలపల్లి, రొద్దం మండలంలోని బీదానిపల్లి, శ్యాపురం, కంబాలపల్లి తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి గ్రామంతో పాటు పంచాయతీల వారీగా కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అధికార కూటమి సర్కార్ చేస్తున్న అరాచకాలను ఎప్పటికప్పుడు ఎండగట్టి, ప్రజా సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం అవలంభిస్తున్న నిర్లక్ష్య ధోరణిని ప్రజలకు వివరించాలన్నదే తమ లక్ష్యమన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు అయినా నేటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను ఏమాత్రం నెరవేర్చలేదని అన్నారు. రాష్ట్ర ప్రజలను మోసం చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి కొత్తేమీ కాదన్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేర్పడిన మూడునెలలకే అనేక హామీలను నెరవేర్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. మాయమాటలతో ప్రజలను వంచించిన ఘనా పాటి నారా చంద్రబాబునాయుడన్నారు. ఐదు నెలల్లోనే ప్రతి గ్రామంలో ప్రజలు కూటమి సర్కార్‌పై అసంతృప్తితో ఉన్నారని అన్నారు. ప్రజలకు ఏమాత్రం న్యాయం చేయలేని చంద్రబాబునాయుడు ప్రభుత్వానికి రాబోవు రోజుల్లో గడ్డుకాలమేనన్నారు. మోసపోయిన ప్రజలంతా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని, ఎప్పుడు ఎన్నికలొచ్చినా కసిగా జగనన్నను ముఖ్యమంత్రిగా చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

శుభకార్యంలో పాల్గొన్న ఉషశ్రీచరణ్

పరిగి, రొద్దం మండలాల్లోని జంగాలపల్లి, కంబాలపల్లి గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఉప్పర ఈశ్వరప్ప, సుధాకర్‌రెడ్డి నూతన గృహ ప్రవేశ కార్యక్రమాలలో మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ పాల్గొన్నారు. పార్టీ మండల కన్వీనర్లు నరసింహమూర్తి, బోయ తిమ్మయ్య, నాయకులు ఎస్.నారాయణరెడ్డి, అక్కులప్ప, లక్ష్మీనారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిలకల రవి, తాడెప్ప, ఎంపీటీసీ మారుతీరెడ్డి, మాజీ సర్పంచ్ గోవిందరెడ్డి రఫీక్ తదీతరులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షురాలిని కలసిన రామకృష్ణ



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గద్దం రామకృష్ణ

పెనుకొండ రూరల్: కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కర్నూలు పట్టణానికి చెందిన, గద్దం రామకృష్ణను వైఎస్సార్ సీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి ఇటీవల నియమించారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శ్రీసత్యసాయి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు ఉష శ్రీ చరణ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, కొండలరాయుడు, బొగ్గు కిష్టా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక పూజలు



టీచర్స్ కాలనీలోని ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

హిందూపురం: కార్తీకమాసం చివరి శనివారం పురస్కరించుకుని స్థానిక పేట వేంకటరమణ స్వామి ఆలయంలో మూలవిరాట్ వెంకటరమణస్వామిని దర్బార్ శ్రీకృష్ణుడిగా విశేషంగా అలంకరించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత పేట వెంకటరమణ స్వామి ఉత్సవ మూర్తులప్రాకారోత్సవం నిర్వహించారు. అలాగే ధ్వజస్తంభ పతాకానికి పూజలు చేసి మహా మంగళ హారతులిచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు పొంగలి నైవేద్యం అందజేశారు. అలాగే పట్టణంలోని డీబీకాలనీ, బెంగళూరు రోడ్డు టీచర్స్ కాలనీలోని శనీశ్వరస్వామి ఆలయంలో రాత్రి పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో కార్తీకదీపోత్సవం, జ్వాలా తోరణాలను వెలిగించి పూజలు నిర్వహించారు.

గుడిబండ: కార్తీక మాసం చివరి శనివారం కావడంతో కొంకల్లు గ్రామంలో వెలిసిన ఆంజనేయ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

అధికారుల వైఖరిపై ఆగ్రహం



సమస్యలను లేవనెత్తుతున్న కౌన్సిలర్లు

పావగడ: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం సాధారణ సభ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ రాజేష్ మాట్లాడుతూ.. మున్సిపల్ ముఖ్య అధికారి జాఫర్ షరీఫ్, ఆరోగ్య తనిఖీ అధికారి షంషుద్దీన్ బాధ్యతా రహితంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. షంషుద్దీన్ తన పని తాను చేసుకోకుండా ఎప్పుడు ముఖ్య అధికారి జాఫర్ షరీఫ్ వెంటే ఉంటాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో పరిశుభ్రతను కాపాడటంతో విఫలమయ్యారని మండిపడ్డారు. ఇకనైనా శ్రద్ధగా విధులు నిర్వహించాలని సూచించారు. 7వ వార్డు కౌన్సిలర్ బాల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. మున్సిపల్ బస్టాండ్ దుకాణాలను వేలం వేయాలనుకుంటే.. అక్కడి ప్రయాణికుల కోసం ఔషధాల దుకాణం, ప్రథమ చికిత్స కేంద్రం, పోలీస్ చౌక్ ఏర్పాటు చేసిన అనంతరం దుకాణాలను వేలం వేయాలని సూచించారు. పట్టణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆక్రమణకు గురైన మున్సిపల్ స్థలాలను గుర్తించి మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు గీత, ముఖ్యాధికారి జాఫర్ షరీఫ్, కౌన్సిలర్లు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక వికలాంగులకు చేయూత



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్ వాసుదేవన్

పెనుకొండ: దాతల సహకారంతో మానసిక వికలాంగులు, దివ్యాంగులకు చేయూతనందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవన్ తెలిపారు. శనివారం పట్టణంలోని భవిత సెంటర్‌లో న్యాయసేవా అధికార సంస్థ, న్యాయమూర్తి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. అనంతరం వైద్యులు భాస్కరరెడ్డి, భానునాగశ్రీ, రాజశేఖర్ తదితరులు వైద్య సేవలు అందించారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, కార్యదర్శి శరత్‌బాబు, హెచ్‌ఎం వెంకటరామిరెడ్డి, ప్యారా లీగల్ వలంటీర్ నరసప్ప పాల్గొన్నారు.